క్లుప్తంగా

డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

వంగర: మండలంలోని రాజులగుమ్మడ సాగు నీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా ఎ.పార్థసారధి, ఉపాధ్యక్షుడిగా పి.పాపినాయుడు ఎంపికయ్యారు. ఎన్నికల అధికారి ఆర్.రామచంద్రరావు, సహాయ ఎన్నికల అధికారి తిరుమలరావు, తహసీల్దారు దిరిశాల ధర్మరాజులు ఎన్నికైన వారికి మంగళవారం ధ్రువపత్రాలు అందజేశారు.

సవరణ బడ్జెట్‌పై సమావేశం



బడ్జెట్ వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

రేగిడి: మండల పరిషత్ కార్యాలయంలో సవరణ బడ్జెట్‌పై మంగళవారం సమావేశం నిర్వహించారు. 2024-25 సవరణ బడ్జెట్ రూ.2,55,47,839లు కాగా, 2025-26 అంచనా బడ్జెట్ రూ.2,65,57,639లుగా ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు. 2023-24 బడ్జెట్ ముగింపు నిల్వ రూ.2,57,77,840లు కాగా, 2024-25 అంచనా బడ్జెట్ రూ.2,55,26,939లుగా ముగించడమైందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు గడువు పెంపు

రాజాం: చెన్నై దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించనున్న హిందీ పరీక్షల ఫీజు గడువు పెంచినట్లు రాజాం..కు చెందిన హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. పరిచయ, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు ఈ సభ ద్వారా జరుగుతున్నాయని, ఈ పరీక్షల ఫీజును ఈ నెల 26వ తేదీ వరకు చెల్లించుకోవచ్చన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ పరీక్షలు ఉంటాయని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫోన్ నంబర్ 9949917365ను సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన



ర్యాలీలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది

మెంటాడ: మండలంలోని చల్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆరోగ్య సంరక్షణతో పాటు సాధారణ వ్యాధులు, మధుమేహం వ్యాధి నియంత్రణపై ఆశ కార్యకర్తలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టి, ప్రజలు వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వైద్యుడు బి.వరప్రసాద్ వివరించారు. మంచి ఆహారపు అలవాట్లు, జీవన విధానం, యోగా, వ్యాయామమే మనల్ని వ్యాధుల నుంచి రక్షిస్తాయని, ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మతిస్థిమితం లేని మూడేళ్లలోపు పిల్లలను ఆస్పత్రికి తీసుకువస్తే మంచిదని, బాగు చేయవచ్చన్నారు.


మధ్యాహ్న భోజనం తనిఖీ



వన్నలి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడు వలస, చాటాయివలస, వండానపేట, ఉంగరాడమెట్ట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, మండల విద్యా కమిటీ సభ్యులంతా మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు సిబ్బంది పనితీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంటకాలు వండి పెట్టాలని, వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.కిశోర్, ఎ.సీతంనాయుడు, గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

అనుమానితులపై నిఘా ఉంచండి



సచివాలయ మహిళా పోలీసులకు సూచనలిస్తున్న సతీష్‌కుమార్

బొబ్బిలి: పట్టణంలో, పట్టణ పరిసర ప్రాంతాల్లోనూ అనుమానితుల సంచారంపై నిఘా ఉంచాలని సీఐ కె.సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సచివాలయ మహిళా పోలీసులతో మంగళవారం సమావేశమైన ఆయన.. అనుమానితుల జాబితాను వారికి అందజేసి, పలు సూచనలు చేశారు. శాంతిభద్రతలు కాపాడేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి, చోరీలు జరగకుండా ఉండేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయన్నారు. సమావేశంలో ఎస్ఐ ఆర్.రమేష్, ఏఎస్ఐ జి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత గాలికి.. ప్రాణాలు పైపైకి..



రాజయ్యపేటలో భారీ రక్షిత మంచినీటి పథకం ట్యాంకు

- తాగునీటి పథకాల ద్వారా కలుషిత నీరు
- సచివాలయాల్లో నిరుపయోగంగా టెస్టింగ్ కిట్లు
- నాణ్యతను గాలికొదిలేసిన అధికార యంత్రాంగం
- గ్రామాల్లో విజృంభిస్తున్న డయేరియా, విషజ్వరాలు

రాజాం:

తాగునీటి నాణ్యతా లోపం.. ప్రజలకు శాపంగా మారింది. ప్రస్తుతం ఎక్కడికక్కడ రక్షిత మంచి నీటి తాగునీటి పథకాల ద్వారా కలుషిత నీరు వస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని, అదే నీటిని తాగి డయేరియా, విషజ్వరాల బారినపడి ప్రజలు తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజారోగ్యమే లక్ష్యంగా గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాగునీటి పరీక్ష కిట్లను సచివాలయాలకు సరఫరా చేసింది. వాటితో నీటి నాణ్యతను పరీక్షించి, పరిశుభ్రమైన నీరు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుతం అవే కిట్లు సచివాలయాల్లో నిరుపయోగంగా పడి ఉన్నాయి. నీటి నాణ్యతను పరీక్షించాల్సిన సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇప్పుడు అంచనాన నాణ్యతను చెప్పేసి, కాలం గడిపేస్తున్నారు. దీంతో కలుషిత నీరు ప్రజల ఆరోగ్యం దెబ్బతీస్తోందని పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తాగునీటి పరీక్ష కిట్లు సక్రమంగా వినియోగించి, ప్రజలకు మంచినీరు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మందరాడ గ్రామ సచివాలయంలో వాడకుండా వదిలేసిన నీటి నాణ్యత పరీక్ష కిట్లు

157 టెస్టింగ్ కిట్లు..

తాగునీటి నాణ్యతను పరీక్షించేందుకు గతంలోని జగనన్న ప్రభుత్వం రాజాం నియోజకవర్గంలోని రేగిడి, రాజాం, వంగర, సంతకవిటి మండలాలకు మొత్తం 157 ఫీల్డ్ టెస్టింగ్ కిట్లు సరఫరా చేసింది. ఈ కిట్లను ఉపయోగించి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతిరోజూ నీటి నాణ్యత పరీక్షలు చేసి, నియోజకవర్గ కేంద్రానికి పంపించాలి. నీటి నాణ్యత పరీక్ష చేస్తున్నప్పుడు ఫొటో కూడా తీయాలి. అయితే పలు పంచాయతీల్లో దీనికి భిన్నంగా జరుగుతోంది. గతంలో ఎప్పుడో ఓసారి టెస్టింగ్ సమయంలో తీసిన ఫొటోనే మళ్లీ మళ్లీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి పంపించేస్తున్నారు. ఆ తర్వాత అంచనాన నీటి నాణ్యతను లెక్కగట్టి, ఆన్‌లైన్‌లో నమోదు చేసేస్తున్నారు. ఫలితంగా కలుషిత నీరు తాగి, ప్రజలు రోగాల పాలవుతున్నారు. అలాగే గత ప్రభుత్వం ఇచ్చిన కిట్లు కూడా సచివాలయాలకే పరిమితమవుతున్నాయి.



రాజాంలోని మారుతీనగర్‌లో కుళాయిల ద్వారా వస్తున్న కలుషితనీరు

ఆస్పత్రి పాలవుతున్నాం..

తాగునీటి పైపులైన్‌ల ద్వారా మురికినీరు వస్తోంది. ఇటీవల మా గ్రామంలో డయేరియా, విషజ్వరాల బారినపడి పలువురు ఆస్పత్రి పాలయ్యారు. తాగునీటి కలుషితం కారణంగానే ప్రజలు రోగాలపాలవుతున్నారు. తాగునీటి వల్లే ఇదంతా జరిగి ఉంటుందని పరీక్షలు కూడా చేశారు. అప్పటికే నలుగురైదుగురు జ్వరాలతో మంచానపడ్డారు.

– బి.రమణమ్మ, పెనుబాక, రాజాం

బురదనీరు వస్తోంది..

మా గ్రామంలోని తాగునీటి పైపులైన్ ద్వారా ఎప్పటికప్పుడు బురదనీరు వస్తోంది. అదే నీటిని తాగాల్సిన పరిస్థితి వస్తోంది. కలుషిత నీరు తాగడం వల్ల జ్వరాలు వస్తున్నాయి. నీటి నాణ్యత పరీక్షలు చేసే అధికారులు కరువయ్యారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

– జి.సత్యవతి, వార్డు మెంబరు, మందరాడ, సంతకవిటి మండలం

చర్యలు తీసుకుంటున్నాం..

తాగునీటి నాణ్యత పరిశీలనల నిమిత్తం చర్యలు తీసుకుంటున్నాం. అన్ని పంచాయతీలకు కిట్లు అందజేశాం. ప్రతిరోజూ నీటి నాణ్యత పరీక్షలు చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఇప్పటికే సూచనలు చేశాం. విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలకు వెనకాడం. కలుషిత నీరు వచ్చే గ్రామాపై ప్రత్యేక దృష్టి సారించాం.

– కె.రాజేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, రాజాం

ప్రజాసమస్యలు పరిష్కరిస్తాం



రామభద్రపురం: రైతు సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దారు సులోచనరాణి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు వినతులు వెల్లువెత్తుతున్నాయి. భూ సరిహద్దు, విస్తీర్ణం, మ్యుటేషన్ సమస్యలు సహా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు, వివిధ ధ్రువపత్రాలకు సంబంధించి ప్రజల నుంచి అధికారులు వినతిపత్రాలు స్వీకరించారు. 40 రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

అప్రమత్తంగా ఉండాలి

వంగర: అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తున్నందున రైతులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు దిరిశాల ధర్మరాజు సూచించారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే కోసిన వరి పనలు పాడవ్వకుండా సురక్షిత ప్రాంతానికి తరలించి భద్రపరుచుకోవాలని తెలిపారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది కూడా అప్రమత్తమై, ప్రజలు రోగాల బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



రాజాం సిటీ: పెనుబాకలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజాం సిటీ: తుపాను నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. ఇదే విషయమై మండలంలోని పెనుబాక రైతు సేవా కేంద్రం వద్ద రైతులను అప్రమత్తం చేస్తూ ఆయన మాట్లాడారు. ఇప్పటికే నూర్పిడి చేసిన ధాన్యం పంటను జాగ్రత్తగా దాచుకోవాలన్నారు. పొలాల్లో కోసి ఉంచిన పంట వర్షానికి పాడవ్వకుండా వాటిపై టార్పాలిన్లు ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఎం.రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: తుపాను ప్రభావంతో రానున్న ఐదు రోజులూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులంతా పంటను భద్రపరుచుకోవాలని ఏవో శ్యామసుందర్ సూచించారు.

క్రిస్మస్ కాంతులు



క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని, చర్చిలన్నీ అందంగా ముస్తాబవుతున్నాయి. బొబ్బిలి పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి విద్యుత్‌దీపాల అలంకరణలో సరికొత్తగా మెరిసిపోతోంది. విద్యుత్ కాంతులీనుతూ అత్యంత సుందరంగా కనిపిస్తున్న ఈ చర్చిని రాత్రిపూట చూసేందుకు సందర్శకులు తరలివస్తున్నారు. ఈ నెల 25న క్రీస్తు జన్మదినం సందర్భంగా ఏటా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుండగా, ప్రస్తుతం అన్నిచోట్ల పండగ వాతావరణం నెలకొంది.

– బొబ్బిలి

'మత్తు'తో జీవితం చిత్తు

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు(నాశనం) అవుతుందని, గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా రాజాం పట్టణంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత, విద్యార్థులు ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి, దురలవాట్ల బారినపడి మంచి జీవితం చెడగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులంతా చెడు అలవాట్లు వీడి, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని తెలిపారు. –రాజాం సిటీ



క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం



క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా రామభద్రపురం మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల పాటు ఎడతెరిపిలేని దగ్గు, జ్వరం, ఛాతిలో నొప్పి, అలసట, నీరసం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే టీబీ(క్షయ) నిర్ధారణకు పరీక్ష చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి, హెచ్ఎల్‌హెచ్‌పీ బి సింధు,హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

– రామభద్రపురం

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



రాజాం: సత్కారం పొందిన సీనియర్ పెన్షనర్లు

రాజాం: ప్రభుత్వ పెన్షనర్లంతా ఐక్యతతో ఉండాలని అఖిల భారత ప్రభుత్వ పెన్షనర్ల రాజాం సంఘ అధ్యక్షుడు నారంశెట్టి గౌరీశంకరరావు, ప్రధాన కార్యదర్శి డోల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలో ఆ సంఘ ప్రాంతీయ కార్యాలయం వద్ద అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించిన అనంతరం సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి కొల్లి రామారావు, గౌరవాధ్యక్షులు మజ్జి చంద్రినాయుడు, ఉపాధ్యక్షులు జడ్డు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్, ముఖ్యసలహాదారు ఎస్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి పెన్షనర్ల సమస్యలు..



బొబ్బిలి: ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

బొబ్బిలి: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక పట్టణంలోని శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రౌతు రామ్మూర్తినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గతంలో చంద్రబాబు 27 శాతం ప్రకటించి 24 శాతం మాత్రమే ఐఆర్ ఫిట్‌మెంట్ ఇచ్చారని, ఆ లోటు భర్తీ చేయడానికి ఈసారి 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మండల కేంద్రాల్లో పెన్షనర్ల భవనాలకు స్థలం ఇవ్వాలని, త్వరలో ఏర్పాటు చేయబోయే అనాథ ఆశ్రమం నిర్మాణానికి కూడా స్థలాన్ని ఇవ్వాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ బొబ్బిలి అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన ఈ శిక్షణలో పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధి జరగాలని తెలిపారు.

– బొబ్బిలి, రాజాం



వంగరలో జరిగిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



రాజాం: ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సులోచన



రేగిడి: సూచనలిస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు



తెర్లాం: కార్యక్రమానికి హాజరైన శిక్షణార్థులతో ఎంపీడీవో రాంబాబు, తదితరులు

సంక్షిప్తంగా...

ఆక్రమణలు తొలగించాలి

బొబ్బిలి: పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పేదల స్థలాలు చాలావరకు ఆక్రమించారని, అధికారులు ఆక్రమణదారులపై దృష్టి సారించాలన్నారు. ఇదే విషయమై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారాయణలకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు పలువురు తెలిపారు.

21న మండల సర్వసభ్య సమావేశం

బొబ్బిలిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పప్పు రవికుమార్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

కొత్త పైపులైన్ వేయండి



పైపులైన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని తారకరామా కాలనీలో పాడైన తాగునీటి పైపులైన్‌లను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం పరిశీలించారు. పాత పైపులైన్‌ల స్థానంలో కొత్త పైపులైన్‌లు వేయాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. రోడ్లు, కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

చిత్రలేఖనం పోటీలు

రాజాం సిటీ: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక సన్ స్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు మంగళవారం నిర్వహించారు. విద్యుత్ పొదుపు, ఆవశ్యకత అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో 85 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు విజేతలను ప్రకటించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఈ బీవీఎస్ ఫణీంద్రకుమార్, ఏఈ ఓజేసీపీ కుమార్, ప్రిన్సిపాల్ వై.భారతి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ వద్ద సౌకర్యాల్లేవ్..

రేగిడి: మండలంలోని సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద చెరకు తరలిస్తున్న రైతులు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అప్పాపురం మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు ఆరోపించారు. ఇదే విషయమై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు కూడా చేయడం జరిగిందని ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. చెరకు రైతుల సంక్షేమాన్ని యాజమాన్యం పట్టించుకోవడం లేదని విమర్శించారు. విశ్రాంతి భవనం, మంచినీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు లేవన్నారు. ఇప్పటికైనా సదరు సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్ర

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామంలో సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర మంగళవారం అవగాహన కల్పించారు. తెలియని నంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వచ్చినా, మెసేజ్‌లు వచ్చినా స్పందించవద్దని, మన ఫోన్‌కు వచ్చే ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దని తెలిపారు. చాలామంది స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసర లింకులపై క్లిక్ చేసి, తమ బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను కోల్పోతున్నారన్నారు. సమావేశంలో ఎస్ఐ పి.నీలావతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న భానుమూర్తి

మెంటాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా భానుమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కూర్మనాథ్ పట్నాయక్.. డీపీఆర్‌సీ జిల్లా కో–ఆర్డినేటర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ మేరకు ఇరువురికీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సోహినీ రాఘవ్. రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.


ఆకట్టుకున్న తిరుప్పావై ప్రవచనాలు



ప్రవచనాలు చెబుతున్న ప్రవచనకర్త పద్మావతి

బొబ్బిలి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని శ్రీరుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రవచన కర్త తూపురాణి పద్మావతి మంగళవారం చెప్పిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. ధనుర్మాసోత్సవాలు ముగింపు రోజు అయిన 2025 జనవరి 14వ తేదీ వరకు ప్రవచన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పాతబొబ్బిలి, కంచరవీధి, మహరాణిపేట, మల్లమ్మదేవి చెరువు గట్టు ఆలయాల్లో ధనుర్మాస పూజలు చేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

రాజాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికలు) విద్యార్థినులకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ కె.జనార్దనరావు మంగళవారం అందజేశారు. బీ, సీ కేటగిరీల విద్యార్థులకు వీటిని అందించామని, శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.